క్లుప్తంగా

తిరుపతి ఎంపీకి ఆహ్వానం

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లంలో ఈ నెల 8న నిర్వహించనున్న బాల పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాలని గ్రామస్తులు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తిని ఆహ్వానించారు. శుక్రవారం తిరుపతిలోని ఎంపీ స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ప్రసాద్, రమేష్, అంబేడ్కర్ స్టార్ కృష్ణ, చంద్రయ్య, గురవయ్య, విజయ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది సప్లిమెంటరీ పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. పరీక్షల చీఫ్‌లు రవి, నారయణమ్మ ఏ, బీ కేంద్రాల్లో పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనుల పరిశీలన



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం జల వినాయకుని ఆలయ సమీపంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను శుక్రవారం పాలకమండలి చైర్మన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు మరుగుదొడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ప్రస్తుతం నిర్మించే సామూహిక మరుగుదొడ్లతో ఆ సమస్య తీరుతుందన్నారు. స్వర్ణముఖి నదిలో కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ



గోపూజలో పవిత్రారెడ్డి, గ్రామస్తులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం శేషంనాయుడు కండ్రిగ అరుంధతివాడలో శ్రీ రేణుకామాత పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గోపూజ చేశారు. మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పవిత్రారెడ్డి ముఖ్య అతిథిగా పూజలకు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, గోవులు సకల దేవతలకు నిలయమని, గోపూజతో సకల పాపాలకు నివృత్తి కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అనంతరం గ్రామ సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ గురుస్వామి నాయుడు, దీపక్ రెడ్డి, నరసింహ నాయుడు, కొన్నలి రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, నాగమణి, వెంగళ్ రావు, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరం వద్ద ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌వీఎస్ జైన్ సంఘం తెలిపింది. పదమ్ చంద్ జైన్ 4వ వర్ధంతి పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. వైద్య పరీక్షలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తేవాలని, పట్టణ, గ్రామీణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

బాధితులకు ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందావనం కాలనీలో రెండు రోజుల క్రితం గాలీవాన ధాటికి ఓ ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. వారు అసలే నిరుపేదలు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.5వేలను స్థానిక నాయకుల ద్వారా బాధితులకు అందజేశారు.

పురిటి బిడ్డకు ఊపిరి పోశారు



చికిత్స అనంతరం పురిటి బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆస్పత్రి వైద్యులు

రేణిగుంట: పుట్టుకతోనే అతి తక్కువ బరువు (1కిలో)తోపాటు తీవ్ర అనారోగ్యం, శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న పురిటి బిడ్డకు రేణిగుంట అమర ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలను అందించి ప్రాణం కాపాడినట్లు ఆ ఆస్పత్రి సీఈఓ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. పురిటి బిడ్డ (తల్లి పేరు బేబి నర్మద, స్వస్థలం పీలేరు) శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బందికర పరిస్థితిలో తీవ్ర ఇన్ఫెక్షన్‌తో రెండు నెలల కిందట ఆస్పత్రిలోని అడ్వాన్స్ లెవల్-3 ఎన్‌ఐసీయూ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేశారు. శిశు సంరక్షణ డిపార్ట్‌మెంట్ వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ బృందం చిన్నారికి ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యసేవలను అందించారు. ఇన్‌ఫెక్షన్లు తగ్గించడంతో పాటు ఎలాంటి న్యూరాలజికల్ సమస్యలు రాకుండా 55రోజుల పాటు వైద్య సేవలను అందించారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా 2కిలోల 300గ్రాముల బరువుతో చాలా యాక్టివ్‌గా ఉండటంతో శుక్రవారం డిశ్చార్జ్ చేసి పసికందు తల్లిదండ్రులకు అప్పగించారు.

మౌలిక వసతులకు పెద్దపీట

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



శాటిలైట్ కాలనీలో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



రైతులకు రైతు భరోసా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ సచివాలయం-2లో పరిధిలోని వడ్డిపాళెం, శాటిలైట్ కాలనీ, వరదయ్యపాళెం దళితవాడ, అరుంధతివాడ, బలిజపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 345 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

వడ్డిపాళెంలో వీధిలైట్లు వెలగడం లేదని, వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కోరారు. అలాగే అరుంధతివాడ, శాటిలైట్ కాలనీలో శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. వీధి లైట్లు వేయాలని పంచాయతీ ఈఓను, శ్మశానానికి దారి కల్పించాలని తహసీల్దారు గౌరీశంకర్‌రావు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. రోడ్లను కూడా విడతల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు.

రూ.70లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ

ఏళ్ల కాలంగా వరదయ్యపాళెం దళితవాడ, అరుంధతివాడ, బలిజపాళెం, శాటిలైట్ కాలనీల్లో మురుగు కాలువలు లేక రోడ్లపై నీరు నిల్వ చేరి స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఇటీవల స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆయన స్పందించారు. కాలువల నిర్మాణానికి రూ.70లక్షలు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శాటిలైట్ కాలనీ వద్ద మురుగునీటి కాలువల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ప్రజలందరూ జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదిస్తే ప్రతి గ్రామం అభివృద్ధి వైపు నడుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మండల యూత్ కన్వీనర్ వినోద్‌యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ జ్యోతి, వక్ఫ్ బోర్డు కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంరాజు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను వరదయ్యపాళెంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రైతులకు పంపిణీ చేశారు. అలాగే వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద మండలంలో 5,015మంది రైతులకు మంజూరైన రూ.3.78కోట్ల నగదు మెగా చెక్కును కూడా అందజేశారు. కార్యక్రమంలో మండల రైతు సలహా కమిటీ అధ్యక్షుడు మురళీనాయుడు, వ్యవసాయాధికారి సుహర్‌లత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట పంచాయతీ దళితవాడలో శుక్రవారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన చెల్లా సుబ్రమణ్యం, సతీమణి చందనప్రియ కుటుంబీకులు దళితవాడలో ఆలయ నిర్మాణానికి నిధులు సమకూర్చారు. మండల కన్వీనర్ కే.సునీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏఎంసీ బాలాజీ రెడ్డి, సర్పంచ్ టి.జయ, కమ్యూనిటీ వైద్యశాల కమిటీ సభ్యులు గోవిందస్వామి, పార్టీ నాయకులు రాజారావు, జీ.గోపి, దళవాయి అగ్రహారం సర్పంచ్ బాలాజి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూపేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



రూపేష్ కుటుంబానికి ఆర్థిసాయం చేస్తున్న ఎంపీపీ నిర్మలమ్మ, వాసుదేవనాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తెలుగు గంగ కాలువలో పడి గల్లంతైన రూపేష్(11) కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ అందజేశారు. మండలంలోని పొయ్య పంచాయతీ గురుకులపాళెం దళితవాడకు చెందిన కట్టా శ్రీరాములు, సక్కమ్మల కుమారుడు రూపేష్ గత నెల 11న సింగమాల దగ్గర తెలుగు గంగ కాలువలో సరదాగా ఈతకు వెళ్లి గల్లంతవడం విదితమే. అప్పట్లో గజ ఈతగాళ్లతో పోలీసులు ముమ్మరంగా తెలుగంగ కాలువ వెంబడి గాలించారు. అయినా ఇప్పటివరకు రూపేష్ ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం రూపేష్ కుటుంబాన్ని ఎంపీపీ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మురు మోహన్, కన్నలి లీలాప్రసాద్, టి.క్రాంతికుమార్, చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో చేర్పించరూ!



మాట్లాడుతున్న అధ్యాపకులు

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పాసైయిన విద్యార్థినులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీయెట్‌లో చేర్పించాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ విజయకుమారి, అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు కాటూరు, వీయస్‌పురం, పల్లమాల గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థినుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. తమ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులున్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, టెన్త్ ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాలేజీలో ఉన్న వసతులను వివరించారు. మరిన్ని వివరాలకు 9703479970 నంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు సురేంద్ర, మార్టిన్, రఘువీర్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కంచి గరుడ సేవ

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి కంచి గరుడ సేవ శుక్రవారం ఉదయం వేడుకగా నిర్వహించారు. ఏటా కంచిలో పున్నమి గరుడ సేవను పురస్కరించుకుని నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి సన్నిధిలో గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డివైడర్లు ఏర్పాటు



ఏర్పేడు: ఏర్పేడులో ట్రాఫిక్ నియంత్రణకుగాను శుక్రవారం స్థానిక వెంకటగిరి రోడ్డులో ఏర్పేడు సీఐ శ్రీహరి డివైడర్లను ఏర్పాటు చేశారు. మండలంలో ఆరులేన్ల రహదారి పనులు చేస్తుండడంతో రోజూ ట్రాఫిక్ సమస్యలతో గ్రామస్తులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులకు అవసరమైన మట్టి, గుల్ల, కంకర తరలిస్తున్న భారీ లారీల రాకపోకల మూలాన ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇక్కట్లను అధిగమించడానికి డివైడర్లు ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు.

బాణసంచా గోదాముల తనిఖీ

ఏర్పేడు: మండలంలోని పల్లంపేట అయ్యప్ప క్రాకర్స్, ఐఐటీ సమీపంలోని నవీన్ క్రాకర్స్ గోదాములను ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం తనిఖీ చేశారు. టపాకాయల గోదాముల లైసెన్స్, నిల్వ చేసిన టపాకాయలను పరిశీలించారు. అయ్యప్ప క్రాకర్స్ లైసెన్స్ కాల పరిమితి తీరడంతో తిరిగి రెన్యూవల్ చేసుకోవాలని యజమానికి సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నాటు బాంబులు తయారు చేస్తున్న పక్షంలో ఇవ్వాలని కోరారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం



రేణిగుంట: విద్యార్థుల ఉజ్వల భవితకు 10వ తరగతి తొలిమెట్టు అని తిరుపతి ఆదాయపు పన్ను శాఖఅడిషనల్ కమిషనర్ యాదగిరి అన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచిన రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలకు చెందిన 86మంది విద్యార్థులను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. వారికి బ్యాగులు, విద్యా సామగ్రిని పంపిణీ చేసి యాదగిరి మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, ఎంపీడీఓ హరిబాబు, సంస్థ మండల కో–ఆర్డినేటర్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రయాణికుల ముసుగులో చోరీలు

- ముగ్గురు మహిళల అరెస్ట్
- రూ.3.80 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల ముసుగులో చోరీలకు పాల్పడిన ఘటనలో ముగ్గురు మహిళలను నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్‌చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎ.లక్ష్మి గత నెల 14వ తేదీన నెల్లూరుకు వచ్చారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె గాంధీబొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ముగ్గురు గుర్తుతెలియని మహిళలు అదే ఆటోలో ఎక్కారు. లక్ష్మికి చెందిన హ్యాండ్ బ్యాగ్ తెరిచి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. బస్టాండ్ వద్ద ఆటో దిగిన లక్ష్మికి బ్యాగ్‌లోని నగలు కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై ఎ.సైదులు తన సిబ్బందితో కలిసి కేసు దర్యాప్తును ప్రారంభించారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లు, సాంకేతికత ఆధారంగా నిందితురాళ్లు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.సంధ్య, భాను, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, గొట్లం గ్రామానికి చెందిన ఆర్.వసంతగా గుర్తించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వీఆర్ లా కళాశాల ఎదురుగా ఉన్న రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేసి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతోపాటు క్రైమ్ పార్టీ ఏఎస్సై శ్రీహరి, హెచ్‌సీలు సురేష్, నరసయ్య, నజ్మల్, పీసీ శ్యామ్, వర్ధన్, దేవను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

సింహ వాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడు





సింహ వాహనంపై యోగముద్రలో వెంకన్న, ముత్యపు పందిరి వాహనంలో ..

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం యోగ ముద్రలో సింహవాహనాన్ని అధిరోహించిన కల్యాణ వెంకటేశ్వరుడు రాత్రి ఆబాల భూపాలాన్నిసంరక్షించే కృష్ణావతరంలో సర్వభూపాల వాహనంలో ఉభయ నాంచారులతో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున 4 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలతో పాటు నిర్మిత హోమశాలలో ప్రత్యేక పూజలను పూర్తి చేశారు. 5 గంటలకు మూలవర్లకు శుక్రవార అభిషేకాన్ని నిర్వహించి తొలి గంటతో ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. 7.30 గంటలకు యోగ ముద్రలో సింహ వాహనంపై సుగంధ పుష్పాలతో, స్వర్ణాభరణాలను అలంకరించుకుని అధిష్టించి, మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల హోరు నడుమ గ్రామ వీధుల్లో విహరించారు. ఆ తర్వాత ఆలయంలో ఉత్సవ మూర్తులు ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేద తీరారు. ఆ తర్వాత బకాసురుడిని వధించిన కృష్ణావతారంలో శ్రీదేవీ, భూదేవీ సమేతునిగా ఉయ్యాలసేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మహిళలు మంగళ హారతులతో మొక్కులు చెల్లించారు. ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. శనివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పెద్దకన్నలి, కొత్తకన్నలి, ఎస్టీకాలనీ, కన్నలి దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత గ్రామంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి, ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయ ఇళ్లల్లోని వ్యక్తులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ పార్టీలకతీతంగా నవరత్నాల సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గ్రామంలో సమస్య ఏదైనా ఉంటే పార్టీ కార్యాలయానికి నేరుగా వచ్చి తెలియజేయవచ్చన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తమ పింఛన్లు రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను కొందరు కోరారు. అలాగే ఇటీవల పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనులలో కన్నలి ఎస్టీ కాలనీ వాసుల భూములు కోల్పోయిన వారికి పత్రాలు కూడా లేకపోవడంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి వారికి పరిహారం వచ్చేలా కృషి చేయడంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, మండల కన్వీనర్ ఉన్నం వాసునాయుడు, జెడ్పీటీసీ అర్చనాదేవి, మునిరత్నం, ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, ఎంపీటీసీ పద్మ, సర్పంచ్ రమ, మధు, నరసింహనాయుడు, రమేష్‌బాబు, చంద్రయ్యనాయుడు, పార్టీ నాయకులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించండి



నెలవాయిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవి తీవ్రత దృష్ట్యా మండలంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ, సౌకర్యాలతోపాటు ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం నెలవాయి, వేణుగోపాలపురం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలి వస్తుందని, రోజుకు 5 వేల మంది పని చేయాలని, కూలీల టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భానుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



దుకాణాల వద్ద అధికారులు

శ్రీకాళహస్తి: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా లేబర్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఆలయ పరిసరాల్లోని పలు దుకాణాల్లో కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఎవరైనా బాలల చేత పనులు చేయిస్తున్నారా? అని ప్రధానంగా పరిశీలించారు. ఆ తర్వాత దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 1986 బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోకూడదన్నారు. ఆ వయసు వారిని స్కూళ్లకు పంపి, వారి భవితకు బాటలు వేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షతో పాటు జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రంగనాధం, శ్రీమన్నారాయణ, సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



దాసుకుప్పంలో ఫ్రైడే ..డ్రైడే నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది

సత్యవేడు: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.గుణశేఖర్ అన్నారు. శుక్రవారం దాసుకుప్పం పంచాయతీలో పీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది కలసి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. ఆరుబయట నిద్రించే వారు దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇళ్ల వద్ద నీటి కుండలలో నిల్వ నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ మురళీమోహన్, ఏఎన్ఎం సుమలత, ఎంఎల్‌పీహెచ్ మహాలక్ష్మి, ఆశావర్కర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాల అప్పగింత

- చికిత్స పొందుతూ మరొకరి మృతి
- నలుగురికి చేరిన మృతుల సంఖ్య
- బ్రెయిన్ డెడ్‌తో వెంటిలేటర్‌పై చిన్నారి
- తెలంగాణ కుటుంబానికి తీరని విషాదం

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక చెరువు వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, మహబూబాబాద్ జిల్లా, దంతాలపల్లె మండల కేంద్రానికి చెందిన వెంకటమ్మ(65), అశోక్(45), శాన్వితాక్షరి(4) మండలంలోని మేర్లపాక చెరువు కట్ట జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందడం విదితమే. దినేష్(42)కు తీవ్రగాయాలై తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ చెప్పారు. అలాగే ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న భాన్వితాక్షరి(10) పరిస్థితి విషమంగా ఉందని, ఆ చిన్నారి బ్రెయిన్‌డెడ్‌తో అపస్మారక స్థితిలో వెంటిలేటర్‌పై ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

వైభవంగా 'అర్జున తపస్మాన్'



తపస్మాన్ వద్ద అర్జున వేషధారి, భక్తులు, సంతానం కోసం వరబడ్డ మహిళలు

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో ద్రౌపది ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి, అమ్మవారికి అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన తపస్మాన్ (తాటిచెట్టు) వద్దకు పోతురాజు, అర్జునుడి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సంతానం కోసం వరపడిన మహిళలు తపస్మాన్ ముందు సాగిలపడ్డారు. ఈశ్వరుడు, అర్జునుని వేషధారుల మధ్య సంవాదం అనంతరం అర్జున వేషధారి శ్లోకాలు, పద్యాలు పాడుతూ తపస్మాన్ మెట్లు ఎక్కాడు. తనవెంట తీసుకుని వెళ్లిన విభూది, నిమ్మకాయలు, అరటిపండ్లను భక్తులపై చల్లాడు. వాటిని దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్తర గోగ్రహణంలో అర్జున వేషధారి గోవులను మళ్లించాడు. పలు ప్రాంతాల భక్తులను స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.